
సాక్షి సిద్దిపేట

శనివారం । 29 । మార్చి । 2025



మెట్ల బావి..చారిత్రక దారి

మెట్ల బావులు నిరాధరణకు గురై క్రమంగా రూపురేఖలు కోల్పోతున్నాయి. చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. వివరాలు 10లో▸



రథ ప్రతిష్ఠ మహోత్సవం

నాచగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా రథప్రతిష్ఠోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వివరాలు 11లో ▸



న్యూస్‌రీల్

కవితలకు ఆహ్వానం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉగాది పర్వదినం పురస్కరించుకుని 'సాక్షి' ఉగాది కవితలను ఆహ్వానిస్తోంది. ఎనిమిది లైన్లకు మించకుండా తమ కవితలు పంపించాలి. కవితలను, ఫొటో, చిరునామాతో ఈ నెల 29లోగా 86869 60064 నంబర్ వాట్సాప్‌కు పంపించాలి. ఇందులోని ఉత్తమ కవితలను గుర్తించి సాక్షిలో ప్రచురిస్తాం.

ఆర్టీఏ మెంబర్‌గా సూర్యవర్మ



సూర్యవర్మను అభినందిస్తున్న మంత్రి పొన్నం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆర్టీఏ మెంబర్‌గా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షుడు లక్కరసు సూర్యవర్మ నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ నియామక పత్రాన్ని అందించినట్లు సూర్యవర్మ తెలిపారు. పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు పదవులు వస్తాయనడానికి తన నియామకమే నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్, ఓబీసీ సెల్ నాయకులు పాల్గొన్నట్లు సూర్యవర్మ తెలిపారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



మాట్లాడుతున్న నర్సారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్: మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్‌లోని మదీనా మసీద్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ కార్యాచరణకు కులగణన దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బోట్ హౌస్ అబ్బురం



తయారు చేసిన బోట్ హౌస్‌లతో విద్యార్థులు, హెచ్‌ఎం మోహన్‌నాయక్

అక్కన్నపేట(హుస్నాబాద్): అంతక్కపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న విద్యార్థులు వినూత్నంగా బోట్ హౌస్‌లను తయారీచేసి అబ్బురపరిచారు. వాటిని శుక్రవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్‌నాయక్ మాట్లాడుతూ సాధారణంగా ఎవరైనా భూమి మీద ఇల్లు నిర్మించుకొని నివసిస్తుంటారన్నారు. కానీ నీళ్లలో ఇల్లు నిర్మిస్తే ఎలా ఉంటుందో? ఎప్పుడైనా చూశారా? అవును అనే ఆలోచన నుంచి పుట్టిందే బోట్ హౌస్ థీమ్ అన్నారు. ప్రకృతి ఒడిలో సేద తీరుతూ పడవలో విహరిస్తూ ఆ అనుభూతిని మాటల్లో వర్ణించలేమన్నారు. విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యం వెలికి తీసేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

కోనోకార్పస్ చెట్లు తొలగించండి

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో ప్రమాదకరమైన కోనోకార్పస్ చెట్లను తొలగించాలని వాకర్స్ కోరారు. ఈ మేరకు శుక్రవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్, ప్రధానకార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ.. గతంలో పెద్ద ఎత్తున పట్టణంలో కోనోకార్పస్ మొక్కలను నాటడం జరిగిందన్నారు. ఈ చెట్ల వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం రీత్యా వెంటనే చెట్లను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో కిరణ్, సతీష్, శ్రవణ్, శ్రీనాథ్, కిషన్, రమేష్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల.. చెత్త చెత్త

సమస్యల కుప్పలు.. ప్రజలకు తిప్పలు

- కానరాని పారిశుద్ధ్యం.. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానం
- ఇళ్ల మధ్యే డంపు.. వీధులన్నీ కంపు
- ఫాగింగ్ కోత.. దోమల మోత
- అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం
- మున్సిపాలిటీగా మారినా.. మారని రాత
- 'సాక్షి' పరిశీలనలో వాస్తవాలు వెలుగులోకి..

చేర్యాల మున్సిపాలిటీ చెత్త కుప్పను తలపిస్తోంది. పారిశుద్ధ్యం లోపించడంతో ఏ వీధి చూసినా చెత్త దంపులే దర్శనమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. చేర్యాల పట్టణం 2018 ఆగస్టులో మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ పొందింది. ప్రత్యేక పాలన అనంతరం 2020 జనవరిలో పాలకవర్గం ఎన్నికైంది. పాలకవర్గం ఐదేళ్ల కాలం పూర్తిచేసుకున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. రోడ్డు విస్తరణ పనులు ఏళ్లుగా సాగుతున్నాయి. సమన్వయ లోపంతో డివైడర్ మధ్యలో ఉన్న పాత సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు విద్యుత్ కనెక్షన్లు తొలగించడంతో పట్టణమంతా అంధకారం నెలకొంటోంది. ఇలా ఒకటేమిటి అనేక సమస్యలు స్థానికులను వెంటాడుతున్నాయి. 'సాక్షి' పరిశీలనలో అనేక వాస్తవాలు వెలుగు చూశాయి.

చేర్యాల(సిద్దిపేట): గ్రామ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయి ఐదేళ్లు గడిచినా చేర్యాల పట్టణం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. పన్నుల విధింపు పెరిగిందే తప్ప ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కలగలేదు. ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులపై అజమాయిషీ కొరవడింది. దీంతో పట్టణంలో చెత్త సేకరణ సరిగా జరగడంలేదు. అంతర్గత రోడ్లన్నీ దుమ్ముధూళితో దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల నివారణకు ఫాగింగ్ కూడా సకాలంలో చేయడం లేదు. మున్సిపాలిటీలో ఓపెన్ పార్కులు, ఆట స్థలాలు, పబ్లిక్ టాయిలెట్స్, పార్కింగ్ స్థలాలు లేక పట్టణ ప్రజల ఇబ్బందులు అన్నీఇన్నీకావు.

అంతా అంధకారం



రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా డివైడర్ మధ్యలో ఉన్న పాత సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు విద్యుత్ కనెక్షన్లు తొలగించడంతో పట్టణమంతా అంధకారమవుతోంది. రాత్రి వేళ వ్యాపార సముదాయాలు మూసివేసిన అనంతరం పట్టణమంతా కటిక చీకటిగా మారుతోంది. దీంతో స్థానికులు రాత్రి వేళ బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అయినా నేటికీ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

పర్యవేక్షణ లేక..




మూలకు చేరిన ఫాగింగ్ మిషన్లు

మున్సిపల్ పరిధిలో 74 మంది పారిశుద్ధ్యం కార్మికులు పనిచేస్తున్నారు. చెత్త సేకరణ వాహనాలు 12 పనిచేస్తున్నాయి. ఒక్కో వాహనం వెంట ఇద్దరు (డ్రైవర్, హెల్పర్) చొప్పున 24 మంది సేకరణకు, నాలుగు వార్డులకు ఒక జవాన్ చొప్పున ముగ్గురు.. మొత్తం 27 మంది పోగా మిగిలిన వారు పట్టణంలోని 12 వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేయాలి. వీరిని పర్యవేక్షించాల్సిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో పనులు సక్రమంగా జరగడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫాగింగ్ మిషన్లు నిరుపయోగంగా మారాయి.

మున్సిపల్ స్వరూపం

- పట్టణ జనాభా: 18,130
- విస్తీర్ణం: 39 చదరపు కిలోమీటర్లు
- నివాసాలు: 5,166
- రెవెన్యూ జోన్లు: 5
- వార్డులు: 12
- రోజువారీ నీటి అవసరం: 2.7 ఎంఎల్‌డీ
- చెత్త సేకరణ వాహనాలు: 14
- పనిచేస్తున్నవి: 12
- పారిశుద్ధ్య కార్మికులు : 74
- రోజువారి చెత్త సేకరణ: మొత్తం 7.5 టన్నులు
- స్వయం సహాయక గ్రూపులు: 305
- స్ట్రీట్ వెండర్స్ : 3,213
- పెన్షన్ లబ్ధిదారులు: 2,572
- వ్యాపార సముదాయాలు: 640
- ట్రేడ్ లైసెన్సు పొందినవి: 308

రోడ్డుపైనే సంత



మున్సిపల్ కార్యాలయం మొదట పాత గ్రామ పంచాయతీ భవనంలోనే కొనసాగింది. కొద్ది రోజుల క్రితం ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మిస్తామని మున్సిపల్ కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చి వేశారు. ఆ స్థలంలోనే రూ.3కోట్లతో పనులు ప్రారంభించారు. నాన్ వెజ్ మార్కెట్ పనులు పూర్తి చేశారు. కానీ కొన్ని కారణాలతో వెజ్ మార్కెట్ పనులు ప్రారంభం కాలేదు. దీంతో కూరగాయల వ్యాపారులు రోడ్డున పడ్డారు. ప్రతి మంగళవారం జరిగే వారాంతపు సంత రోడ్డుపైనే జరుగుతుండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్త

ఇళ్ల మధ్యే జీవాల వధ



ఇకపోతే రూ.17 కోట్లతో చేపట్టిన సమీకృత కార్యాలయ భవన పనులు నేటికీ పూర్తి కావడంలేదు. కార్యాలయం ఎస్సీ హాస్టల్ భవనంలోనే కొనసాగుతోంది. పూర్తయిన నాన్‌వెజ్ మార్కెట్ ప్రారంభం చేయకపోవడంతో పట్టణ నడిబొడ్డున రోడ్డుకి ఇరు వైపులా మాంసం దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఇళ్ల మధ్యలో మేకలు, గొర్రెలు, కోళ్లు కోస్తుండటంతో ఆ ప్రాంతంలో నివసించే ప్రజలకు తిప్పలు తప్పడంలేదు.

వసతులు కరువు

కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతు బజార్‌లో సరైన సౌకర్యాలు లేక వ్యాపారస్తులు, రైతులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ పరిధిలోని ఆవాసాల నుంచి ట్రాక్టర్లు, ఆటోల ద్వారా సేకరించిన చెత్తను వేయడానికి చేపట్టిన డంపింగ్ యార్డ్ నిర్మాణం పూర్తి కాలేదు. తడి పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ కూడా జరగడం లేదు. సేకరించిన చెత్తను పట్టణశివారుల్లో రోడ్లపక్కన వేస్తున్నారు.

వైకుంఠధామం సైతం..

చివరి మజిలీకి ఇబ్బంది కలగకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వైకుంఠధామం కూడా నేటికీ పూర్తి కాలేదు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులు ప్రస్తుత ప్రభుత్వం ఆపివేయడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ఏది ఏమైనా ప్రభుత్వం నియమించిన మున్సిపల్ ప్రత్యేక అధికారి ప్రత్యేక చొరవ చూపి పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన పనులు పూర్తి చేయాలి



రోడ్డు విస్తరణ పనుల్లో చేపట్టిన వంతెన నిర్మాణం త్వరగా పూర్తిచేయాలి. పనుల జాప్యంతో ఇబ్బంది పడుతున్నాం. ముఖ్యంగా రోడ్డుపై వస్తున్న దుమ్ముధూళిని భరించలేకపోతున్నాం. అధికారులు స్పందించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి.

– నర్ర చంద్రబాబు, స్థానిక వ్యాపారి

ఫాగింగ్ చేయడం లేదు



దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. నివారణకు చేసే ఫాగింగ్ సక్రమంగా చేయడం లేదు. దీంతో సాయంత్రం వేళ వ్యాపారం చేసే చోట ఉండలేకపోతున్నాం. అధికారులు స్పందించి ఫాగింగ్ చేపట్టి దోమలను నివారించాలి.

– బస్వరాజు యాదగిరి, ల్యాండ్రీ షాపు యజమాని

చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్



చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని దృష్టికి వచ్చింది. ఆర్థిక సంవత్సరం ముగింపు కావడంతో వంద శాతం పన్నుల వసూళ్లలో బిజీగా ఉన్నాం. రెండు రోజుల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సమస్య పరిష్కరిస్తాం. సిబ్బంది కొరత వల్ల ఇబ్బంది ఏర్పడుతోంది.. అయినప్పటికీ అన్ని సమస్యలు పరిష్కరిస్తాం.

– ఎస్.నాగేందర్, మున్సిపల్ కమిషనర్

సా..గుతున్న రోడ్డు విస్తరణ పనులు



అర్ధంతరంగా నిలిచిన వంతెన నిర్మాణ పనులు

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం పట్టణ కేంద్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులే. సుమారు రెండేళ్లు గడుస్తున్నా రోడ్డు విస్తరణ పనులు పూర్తికావడంలేదు. రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీరు వెళ్లేందుకు నిర్మించిన సైడ్ కాల్వ పనులు అసంపూర్తిగా మిగిలాయి. పైగా కాల్వల్లోంచి మురికి నీరు బయటకు వచ్చి రోడ్డుపై ప్రవహిస్తోంది. అలాగే ప్రధాన రహదారిపై కడవేర్గు రోడ్డు (గాంధీ సెంటర్) వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు పూర్తి కాలేదు. దీంతో వర్షాలు పడితే ఆ ప్రాంతం నీట మునిగే పరిస్థితి నెలకొంటోంది.



ఎస్సీ హాస్టల్ భవనంలో మున్సిపల్ కార్యాలయ సేవలు

దుబ్బాకలో స్కిల్ యూనివర్సిటీ

- స్థల పరిశీలనకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- రూ.35 కోట్లతో హబ్సీపూర్- దుబ్బాక- లచ్చపేట రోడ్డుకు సైతం గ్రీన్‌సిగ్నల్
- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక: వ్యవసాయ నియోజకవర్గంగా ఉన్న దుబ్బాకలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి దుబ్బాక నియోజకవర్గం పరిస్థితిని వివరించి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ మంజూరు చేస్తే ఈ ప్రాంతానికి మేలు జరుగుతుందని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన సీఎం.. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు స్థల పరిశీలన కోసం దుబ్బాక వెళ్లాల్సిందిగా సీఎంఓ అధికారులను ఆదేశించారని ఎమ్మెల్యే తెలిపారు.

రూ.35 కోట్లు మంజూరు

అలాగే దుబ్బాక మండలం హబ్సీపూర్‌నుంచి దుబ్బాక వయా లచ్చపేట వరకు డబుల్ రోడ్డు నిర్మించాలని సీఎంను కోరడంతో వెంటనే స్పందించి రూ.35 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అడిగిన వెంటనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ తో పాటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డికి కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.కోటి11లక్షలు



భక్తుల కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది, శివరామ కృష్ణ భజనమండలి సభ్యులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయ హుండీల ద్వారా రూ.కోటి 11లక్షల ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణ అధికారి రామాంజనేయులు తెలిపారు. 21రోజులలో హుండీల ద్వారా లభించిన కానుకలను శుక్రవారం స్వామివారి ఆలయ ముఖ మండపంలో లెక్కించారు. నగదు రూ.1,11,96,965, విదేశీ కరెన్సీ నోట్లు 24, మిశ్రమ బంగారం 112 గ్రాములు, మిశ్రమ వెండి 9కిలోల 200 గ్రాములు, పసుపు బియ్యం 20 క్వింటాళ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఆలయ స్థానాచార్యులు మల్లికార్జున్ ఆలయ ధర్మకర్తలు, శివరామ కృష్ణ భజనమండలి సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు

జిల్లా వ్యాప్తంగా 3.45లక్షల ఎకరాల్లో వరి సాగు

- 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- 419 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- ఈసారి అన్ని చోట్లా సన్నాల సేకరణ
- 1.25కోట్ల గన్నీ బ్యాగులు అవసరం



ధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)

సాక్షి, సిద్దిపేట: యాసంగి వరి సాగు కోత దశకు చేరింది. రెండు మూడు వారాల్లో వరికోతలు ఊపందుకోనున్నాయి. దీంతో ధాన్యం సేకరించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. జిల్లా వ్యాప్తంగా 419 కొనుగోలు కేంద్రాలు, 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి అన్ని కేంద్రాల్లోనూ సన్నాలు కొనుగోలు చేసేలా చర్యలు చేపడుతున్నారు. గత వానాకాలంలో కేవలం 69 చోట్లనే సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో వరి 3,46,419 ఎకరాల్లో, సన్నాలు 38,105 ఎకరాల్లో సాగువుతుండగా 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు.

గన్నీ బ్యాగుల సేకరణ

5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కోసం 1.25కోట్ల గన్నీ బ్యాగులు అవసరం. జిల్లాలో ప్రస్తుతం 25లక్షల బ్యాగులున్నాయి. 15లక్షల గన్నీలు రేషన్ డీలర్ల దగ్గర నుంచి తీసుకోనున్నారు. మరో 28లక్షల గన్నీలు త్వరలో కొనుగోలు చేయనున్నారు. అలాగే టార్పాలిన్లు 8,882 ఉండగా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో మరో 3,600 కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తేమ కొలిచే సాధనాలు 667, ప్యాడీ క్లీనర్లు 584, తూకం యంత్రాలు 762లను సిద్ధం చేశారు. అలాగే బియ్యం గింజగా మార్చేందుకు ప్యాడిహస్కల్‌లు, గ్రెయిన్ కాలిపర్ యంత్రాలను అందుబాటులో ఉంచనున్నారు.

వాతావరణ మార్పులతో ఆందోళన

జిల్లాలో ఏటా ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మండిపోతుంటాయి. మరోవైపు ఆకస్మాత్తుగా మెరుపులు, ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తుంటాయి. గతేడాది వరి పంట కొనుగోళ్ల తరుణంలో వర్షాలు కురవడంతో పలు చోట్ల ధాన్యం తడిసిపోయి రైతులు నష్టపోయారు. ఈ సారి వాతావరణం ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం



యాసంగిలో ధాన్యం కొనుగోలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. 419 కేంద్రాల్లో ఒక పక్క దొడ్డు, మరో పక్క సన్నాలు కొనుగోలు చేసేలా ఏర్పాటు చేయనున్నాం. ఏప్రిల్ 1న మండలానికి ఒకటి చొప్పున, ఆ తర్వాత దిగుబడి వస్తుంటే అన్ని చోట్ల కేంద్రాలను ప్రారంభిస్తాం. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయనున్నాం.

– ప్రవీణ్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్

పకడ్బందీగా చేపట్టాలి

కలెక్టర్ మనుచౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేటరూరల్: వరి ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసే 419 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనూ తాలు తీసే, తేమశాతం కొలిచే యంత్రాలు, కాంటాలు, టార్పాలిన్ కవర్లు, గన్నీ బ్యాగులు, తాగు నీటి వసతి ఇతరత్రా సౌకర్యాలను సమకూర్చుకోవాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో దొడ్డు రకం, సన్నరకం ఎన్ని ఎకరాల్లో వేశారు? ఎప్పుడు కోతలు చేస్తారనే విషయాలపై సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

అన్ని ఉద్యమాలకు మూలం కవితలు

- ప్రముఖ కవి నందిని సిధారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సిధారెడ్డి

మెదక్‌జోన్: అన్ని ఉద్యమాల్లో కవితోద్యమం ముందు వరుసలో ఉందని, మలి దశ తెలంగాణ ఉద్యమంలో కవి పాత్ర ఎనలేనిదని ప్రముఖ కవి నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని టీఎన్‌జీవో భవన్‌లో ఉగాది కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. తెరసం మెదక్ జిల్లా అధ్యక్షురాలు ముత్తంగారి కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యతిథిగా సిధారెడ్డి హాజరై మాట్లాడారు. కవిత్వం అన్ని రంగాల అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. చరిత్ర కు వారధులు కవులని, చరిత్ర భావితరాలకు తెలియాలంటే కవులు కళాలను కదిలించాలన్నారు. తెరసం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకర్ మాట్లాడుతూ.. గతేడాది సంతోషాలతోపాటు బాధలు మిగిల్చిందని సునీత విలియమ్స్ భూమి పైన సజీవంగా అడుగు పెట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ యువ కవి ఎక్బాల్, పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు.

విగ్రహ ధ్వంసంపై విచారణ



వివరాలు సేకరిస్తున్న ఏసీపీ పురుశోత్తంరెడ్డి

కొండపాక(గజ్వేల్): మండలంలోని దమ్మక్కపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం పాక్షిక ధ్వంసం చేసిన ఘటనపై శుక్రవారం గజ్వేల్ ఏసీపీ పురుశోత్తంరెడ్డి విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన జింక తిరుపతి విగ్రహం గద్దెపై కూర్చొని కట్టెతో చేయిపై కొట్టడంతో చేయి పాక్షికంగా దెబ్బతిన్న విషయం పాఠకులకు విదితమే. ఈ విషయమై ఏసీపీ గ్రామానికి చేరుకొని ఘటనకు సంబంధించి స్థానికుల నుంచి వివరాలు సేకరించి రికార్డు చేశారు. నిందితుడిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు విషయమై ఎంక్వైరీ చేశారు. సేకరించిన వివరాలను పై అధికారులకు నివేదిస్తామని ఏసీపీ తెలిపారు. ఆయన వెంట తొగుట సీఐ లతీఫ్, ఎస్‌ఐ శ్రీనివాస్, పోలీసులు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం



వ్యక్తి మృతదేహం

సంగారెడ్డి టౌన్ : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ రవీందర్ కథనం మేరకు.. శుక్రవారం ఉదయం పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం ఉందని చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎవరైనా గుర్తిస్తే రూరల్ పోలీస్‌లను సంప్రదించాలని కోరారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మనోహరాబాద్(తూప్రాన్): మూడు రోజుల క్రితం చెరువులో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రంగాయపల్లికి చెందిన మన్నె అజయ్‌కుమార్ (26) బుధవారం గ్రామంలోని చింతల చెరువులో గల్లంతయ్యాడు. రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. కాగా శుక్రవారం చెరువులో మృతదేహం తేలడంతో గ్రామస్తులు బయటకు తీశారు.

కోనేరు.. ఎవరూ పట్టించుకోరు

నర్సాపూర్ రూరల్: కాకతీయుల కాలంలో నర్సాపూర్ మండలంలోని సీతారాంపూర్‌లో నిర్మించిన మెట్ల బావి (కోనేరు) కొన్ని వందల ఏళ్లపాటు సీతారాముల పూజతో పాటు గ్రామస్తులకు తాగునీరు పుష్కలంగా అందించింది. సీతారాంపూర్ గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మించిన రామాలయంకు వాయువ్యం దిక్కు ఈ కోనేరు ఉంది. సుమారు 400 ఏళ్లపాటు సీతారాముల పూజకు కావాల్సిన నీరు, గ్రామస్తుల తాగునీటితోపాటు ఇతర అవసరాలకు మండుటెండల్లో సైతం నిరంతరం నీరు పుష్కలంగా అందించేదని తెలిపారు. బోరు బావులు, నల్లాలు వచ్చిన తర్వాత మెట్ల కోనేరులో నీరు అడగండిపోవడంతో నిరుపయోగంగా మారింది.



సీతారాంపూర్‌లోని మెట్ల బావి (కోనేరు)

మెట్ల బావి.. చారిత్రక దారి

శతాబ్దాల చరిత్ర ఉన్న మెట్ల బావులు మన సంస్కృతిలో భాగం. అయితే దశాబ్దాలుగా నిరాదరణకు గురై రూపురేఖలు కోల్పోతున్నాయి. నేటికీ పునరుద్ధరణకు నోచుకోకపోవడంతో గతంలో సాగు, తాగు నీటికి ఉపయోగపడిన మెట్ల బావులు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. కొన్ని చోట్ల వాడుకలో ఉండగా మరికొన్ని చోట్ల చెత్తాచెదారం పేరుకుపోయి ఎవరూ పట్టించుకోకపోవడంతో చరిత్రకు సాక్ష్యాలుగా మిగిలిపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో శతాబ్దాల చరిత్ర కలిగిన మెట్ల బావులు

- గతంలో సాగు, తాగు నీటికి ఉపయోగం
- నేడు మెట్లు కూలిపోయి చెత్తాచెదారంతో నిరుపయోగం
- చరిత్రకు సాక్ష్యాలుగా మిగులుతూ దర్శనం



వెల్దుర్తిలో వెంకటేశంగుప్త తవ్వించిన మెట్లబావి

సాక్షి ప్రత్యేకం

అద్భుత రాతి కట్టడంతో 600 ఏళ్ల నాటి మెట్లబావి

నేటికీ సాగు నీటికి వినియోగం

చిన్నశంకరంపేట(మెదక్): ఆరు వందల ఏళ్లనాటి అద్భుతమైన రాతి కట్టడంతో నిర్మించిన ఏడు చేదల మెట్లబావి చెక్కు చెదరకుండా తన దర్పం ఒలకబోస్తుంది. వివరాల్లోకి వెళ్తే.. చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామంలో పాపన్నపేట సంస్థాన రాజ్యవంశంలో 1395 నుంచి 1422 మధ్య కాలంలో రాణి చందమ్మ ఏకఛత్రాధిపత్యంలో రాజ్యవిస్తరణకు నడుంబిగించిన కాలంలో నిర్మాణం జరుపుకున్న కట్టడమే చందంపేట కోటదుర్గం. ఈ కోట దుర్గం పక్కనే తవ్విన బావిని రాతి కట్టడంతో మెట్లు, సేద తీరేందుకు అవసరమైన చిన్న చిన్న గదులు ఈ బావి ప్రత్యేకత. ఆరు వందల ఏళ్ల కిందట నాలుగు వైపులా ఎత్తయిన బురుజులతో ఈ కోటను కట్టించారు. ఇదేస్థాయిలో బావి నిర్మాణం చేపట్టారు. అప్పట్లో రాణి చందమ్మ ఏడు చేదల బావి వద్ద సేద తీరేవారని, సైనికులకు, గుర్రాలకు అవసరమమైన తాగునీరుకు వినియోగించేవారని ప్రతీతి. ప్రస్తుతం కూడా వ్యవసాయానికి సాగునీరుగా వినియోగిస్తున్నారు. రాతి కట్టడం ఎక్కడ చెక్కు చెదరకుండా, మెట్లు కూడా వినియోగంలో ఉన్నవి.



చందంపేటలోని మెట్లబావి

కరువులో కూలీలకు ఉపాధి కోసం..

వెల్దుర్తి(తూప్రాన్) : వర్షాభావ పరిస్థితుల వల్ల రాష్ట్రంలో తీవ్ర కరువు ఏర్పడిన సమయంలో వెల్దుర్తి మండల కేంద్రానికి చెందిన కొమిరిశెట్టి వెంకటేశం గుప్త కూలీలకు పని కల్పించడం కోసం సుమారు 1972 సంవత్సరంలో పెద్ద మెట్లబావి తవ్వించారు. సుమారు 40 ఫీట్ల వెడల్పు, 120 ఫీట్ల లోతులో తవ్వించిన బావిలోని నీటిని మొదట్లో చుట్టుపక్కల నివాసితులు తాగునీటికి ఉపయోగించగా కాలక్రమేణ వెంకటేశం గుప్త బావి పక్కనే గల తన వ్యవసాయ పొలానికి సాగునీరుకు ఉపయోగించాడు. మొదట్లో బావిలోకి పెద్ద ఎత్తున ఊట నీరు చేరేదని, ప్రస్తుతం ఊటనీరు చాలా తగ్గడంతో వర్షాకాలంలోనే వర్షపు నీరు చేరుతుందన్నారు. సుమారు 200 రాతిమెట్లు గల భావిని తవ్వడానికి కూలీలకు ఒక్కరోజుకు అప్పట్లో ఒక్క రూపాయి చెల్లించడంతోపాటు వడ్లను ఇచ్చేవారని అప్పట్లో పనులకు వెళ్లిన వృద్ధులు తెలిపారు.

70 ఏళ్లు సాగునీరు అందించి..

ప్రస్తుతం చెట్ల పొదలతో కళ తప్పిన బావి



కన్‌సాన్‌పల్లి గ్రామంలోని ఈశ్వరాలయ మెట్లబావి

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో ఈశ్వరాలయాన్ని క్రీస్తు శకం 1,824 సంవత్సరంలో గ్రామానికి చెందిన కీ.శే నోమన్నగారి వెంకట్‌రెడ్డి తనకు ఉన్న సొంత పొలంలో కొంత భాగాన్ని ఆలయం కోసం కేటాయించి ఆలయాన్ని నిర్మింపజేశాడు. అప్పట్లో ఆలయం, సాగు నీటి అవసరాల కోసం ఆలయం ఎదుట 40 ఫీట్ల లోతులో మెట్ల బావిని తవ్వించి డంగు సున్నం తయారు చేయించి బావి చుట్టూ మెట్లు ఏర్పాటు చేసి రాతితో కట్టించాడు. ఒక్కో లేవల్ 20 అడుగుల ఎత్తు ఉండగా బావి చుట్టూ మెట్లు నిర్మాణం చేపట్టారు. బావిలోకి దిగేందుకు పడమర, వాయువ్యం వైపు మెట్లు నిర్మించారు. ఎండాకాలం, వర్షాకాలం అనే తేడా లేకుండా బావి ఎప్పుడూ నీటిని కలిగి ఉండటంతో సంవత్సర కాలంపాటు ఎద్దులతో మోట కొడుతూ పంటకు నీరందిన చరిత్ర. ఇలా సుమారుగా 70 ఏళ్ల పాటు మెట్లబావి ద్వారా వ్యవసాయానికి నీరు అందించింది. నేడు ఆదరణ లేక చెట్ల పొదలతో నిండి శిథిలావస్థకు చేరుకుంది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన మెట్ల బావిని ప్రభుత్వం పునరుద్ధరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

తెలంగాణాలోనే అతి పెద్ద కోనేరు..

800 ఏళ్ల చరిత్ర కలిగిన కిచ్చన్నపల్లి వేంకటేశ్వర ఆలయ మెట్లబావి

వట్‌పల్లి(అందోల్): ఉత్తర తిరుమలగా పేరున్న కిచ్చన్నపల్లిలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఆలయం కోనేరుకు 800 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ కోనేరు సంగారెడ్డి జిల్లా అందోలు మండలం కిచ్చన్నపల్లి గ్రామంలో ఉంది. ఆలయాన్ని 900 ఏళ్ల కిందట కిచ్చన్న అనే భక్తుడు నిర్మించాడు. సుమారు ఎకరా స్థలంలో 60 ఫీట్ల లోతులో నలువైపులా 30 మెట్లు చొప్పున నిర్మిచారు. ఊట ద్వారా కోనేరులోకి వచ్చే నీటిని భక్తులు స్నానాలు చేయడంతోపాటు ఆ నీటిని ఆలయానికి అవసరమైన పూల తోటలకు కూడా నిత్యం వాడేవారు. భక్తులు కోనేరులోనే స్నానం చేసి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేవారు. గ్రామాల్లో నలువైపులా బోరు బావులు తవ్వడంతో కోనేరులో ఊటలు నిలిచిపోయి ఎండిపోయే పరిస్థితికి వచ్చింది. దీంతో ఆలయ నిర్వాహకులు ప్రత్యేకంగా బోరును వేయించి ఆ నీటితో కోనేరును నింపేవారు క్రమేపి కోనేరును పట్టించుకునే వారు కరువయ్యారు.



కిచ్చన్నపల్లిలో వెంకటేశ్వరాలయం వద్ద కోనేరు

‘బావి’తరాలకు చెప్పడానికి లేకుండా..

సంగారెడ్డి జోన్: చరిత్రకు సాక్ష్యాలుగా ఉన్న మెట్ల బావులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఒక్కప్పుడు సాగుకు, తాగుకు నీరందించి చరిత్ర కలిగిన బావులు నేడు నీరు లేక వెలవెలబోతున్నాయి. 1960–65 సంవత్సరాల మధ్యకాలంలో బావులు నిర్మించినట్లు అక్కడి ప్రజలు చెబుతున్నారు. సుమారు 50 నుంచి 60 లోతుల అడుగులో బావుల నిర్మాణాలు చేపట్టారు. వీటిని నిర్మించేందుకు సుమారు మూడేళ్లు పట్టేదని చెబుతున్నారు. మండలంలో కుప్పానగర్, బర్దీపూర్, మాచ్నూర్ గ్రామ శివారుల్లో పురాతన మెట్ల బావులు ఉన్నాయి. పంటల సాగులో వచ్చిన లాభంతో బావిలోని జలధారలు పైన ఉన్న మట్టితో పూడ్చిపోకుండా ఉండేందుకు మెట్ల బావులను నిర్మించారు.

బోరు ఎక్కువై నీరు అడుగంటి..

మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామ శివారులో



బస్వంత్‌రావు పాటిల్ పొలం వద్ద బావి

బస్వంత్‌రావు పాటిల్ అడివప్ప షెట్కార్, కేశప్ప రైతు పొలాల ఆవరణలో మెట్ల బావిని నిర్మించారు. పూర్వం బోరు మోటార్లు లేకపోవడంతో ఈ బావుల సహాయంతో పంటలు సాగు చేసేవారు. బావిలో నుండి బొక్కెన, ఎడ్ల సహాయంతో నీరు పైకి లాగి పంట పొలాలకు నీరందించేవారు. అదే విధంగా పంట పొలాలకు వివిధ పనులపై వెళ్లిన



కుప్పానగర్ గ్రామ శివారులోని మెట్ల బావి

వారికి దాహార్తిని తీర్చుకునేందుకు ఉపయోగపడేవి. నేడు విచ్చలవిడిగా బోర్లు వేయడంతో భూగర్భజలాలు పడిపోయి మెట్ల బావులు నిరాదరణకు గురి అయ్యాయి. వీటిని పునరుద్ధరిస్తే చరిత్రకు జీవం పోసినట్లు ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం పరుస్తున్నారు.

నైపుణ్యం వెలికితీయడానికి దోహదం

అంతర్జాతీయ సదస్సులో డ్రగ్ కంట్రోలర్ వెంకటేశ్వర్లు



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న అతిథులు, కళాశాల ప్రతినిధులు

నర్సాపూర్ : విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి సదస్సులు దోహదపడుతాయని రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్, డ్రగ్ కంట్రోలర్ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక వైపర్ కళాశాలలో శుక్రవారం ఔషధ్–2025 అంతర్జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్ డెవలప్‌మెంట్, ఫార్మాలాజికల్ ఎఫెక్ట్స్ అంశాలను ఆయన వివరించారు. సదస్సులతో విద్యార్థులకు అనేక విషయాలు తెలుస్తాయని, కావున వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రాన్స్‌జెన్ బయోటెక్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ ఎండీ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఔషధాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రస్తుత కాలంలో ఔషధాలపై ఏఐ టెక్నాలజీ ప్రభావాన్ని వివరించారు. యూఎస్‌ఏ సీనియర్ రిసెర్చ్ సైంటిస్టు నికిల్ పతక్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రయోగాలపై దృష్టి పెట్టాలని సూచించారు. బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ లక్ష్మీ ప్రసాద్, వైపర్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్ తదితరులు మాట్లాడారు. సదస్సు సందర్భంగా టెస్ట్ నిర్వహించారు. భీమవరం ఎస్‌వీసీపీ కాలేజీకి చెందిన పూజ బాల విద్యార్థిని గెలుపొందగా రూ.10 వేల నగదు బహుమతి అందచేశారు. సదస్సు మూడు రోజులు పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు.

జల్సాలకు అలవాటు పడి జీవాలు దొంగతనం

సంతలో అమ్ముతుండగా ముగ్గురు యువకులు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

దుబ్బాకటౌన్ : మూగజీవాలను దొంగిలించి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్ కథనం మేరకు.. రాజక్కపేటలో నర్సింలు 19న తన ఎద్దు, అప్పనపల్లిలో భాస్కర్ 24న తన ఆవు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పరిశీలించారు. దుబ్బాక పట్టణానికి చెందిన పెంటం శ్రావణ్, ఎడ్ల మహేశ్ ఇద్దరు యువకులు జల్సాలకు అలవాటు పడి బావుల వద్ద కట్టేసిన ఆవు, ఎద్దులను రాత్రిపూట టాటా ఏసీ వాహనంలో దొంగతనంగా ఎక్కించి చెల్లాపూర్ శివారులో కట్టేస్తున్నట్లు తేలింది. వీరిద్దరికీ చెల్లాపూర్ వార్డుకు చెందిన నవీన్, మరో యువకుడు సహాయం చేసేవాడు. ఎత్తుకెళ్లిన మూగజీవాలను వివిధ అంగళ్లలో తెలిసిన వారికి అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా గుర్తించి ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాం. వారి నుంచి ఆవు, ఎద్దుతోపాటు టాటా ఏసీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గంగరాజు, కానిస్టేబుళ్లు రాంజీ, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, ఎక్సెల్ వాహనం ఢీ

ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ట్రాక్టర్, టీవీఎస్ ఎక్సెల్ వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ శివారులో గల జోగిపేట–మెదక్ ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అందోల్ మండలం కిచ్చన్నపల్లికి చెందిన మల్లయ్య (55), చిలప్‌చెడ్ మండల పరిధిలోని బంజారానగర్ తండాకు చెందిన గిరిజన మహిళ అంసీ ఇద్దరూ ఎక్సెల్ వాహనంపై జోగిపేట నుంచి తండాకు వస్తున్నారు. చిట్కుల్ శివారులోని పెట్రోల్ పంపు ఆవరణలోకి రాగానే ఎదురుగా వచ్చిన ట్రాక్టర్, ఎక్సెల్ వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందగా, అంసీకి తీవ్ర గాయాలు అయ్యాయి.

కుటుంబం మొత్తాన్ని కుల బహిష్కరణ చేశారు

– చర్యలు తీసుకోవాలని పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



కుమార్

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని మల్లుపల్లిలో కురుమ కులానికి సంబంధించిన భూమి విషయంలో తన కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారని అదే కులానికి చెందిన బాధితుడు గొంగ్లల్ల కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం మిరుదొడ్డిలో బాధితుడు విలేకరులతో గోడును వెల్లబోసుకున్నాడు. తనకు సంబంధించిన భూమి విషయంలో తమ కులస్తులు పలుమార్లు పంచాయితీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో తన కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసినట్లు తెలిపాడు. గతేడాదిగా కులంలో ఎలాంటి పండుగలైనా, పబ్బాలైనా తమకు సమాచారం ఇవ్వకుండా దూరంగా పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతూ మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌తోపాటు, దుబ్బాక సీఐ, సిద్దిపేట సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఈ విషయంపై మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పరుశరామ్‌ను వివరణ కోరగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తల్లిపై కూతురు దాడి

శివ్వంపేట(నర్సాపూర్) : తల్లి పై కూతురు దాడి చేసిన ఘటన మండల పరిధి భోజ్యా పంచాయతీ జెగ్యా తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన కోల కొమిలి కూతురు మంజులను కామారెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. కొన్నేళ్లుగా మంజుల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తల్లి వద్దే ఉంటుంది. శుక్రవారం తల్లి, కూతురి మధ్య గొడవ తలెత్తగా తల్లిపై మంజుల కర్రతో దాడి చేసింది. కొమిలికి తీవ్ర గాయాలు కావడంతో తండావాసులు చికిత్స నిమిత్తం తూప్రాన్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. గొడవకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటన పై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

నాల్గోసారి లెక్క కుదిరింది

- అంగడి వేలం రూ.92.20 లక్షలు
- పంతం నెగ్గించుకున్న గుత్తేదారులు



అంగడి వేలం నిర్వహిస్తున్న మల్లికార్జున్

హుస్నాబాద్: వారాంతపు సంత బహిరంగ వేలానికి నాల్గోసారి లెక్క కుదరడంతో అంగడి వేలం ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం మూడు అంగడిలకు వచ్చిన ఆదాయాన్ని సరాసరి లెక్క కట్టి వచ్చిన ఆదాయంతో సర్కార్ పాటను ప్రారంభించారు. 2022–23 సంవత్సరం రూ.76 లక్షల ఆరు వేలు, 2023–24 రూ.80 లక్షలు, 2024–25 రూ. కోటి 20 లక్షల 26 వేలు. ఈ మూడేళ్ల అంగడికి వచ్చిన ఆదాయంలో సరాసరి లెక్క కట్టి రూ.92 లక్షల 10 వేల, 667 నుంచి సర్కార్ పాటను ప్రారంభించారు. వేలం పాటలో 14 మంది గుత్తేదారురులు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన గుత్తేదారుడు అయిలేని కిషన్ రెడ్డి వేలం ద్వారా రూ.92 లక్షల 20 వేల 667లకు అంగడిని దక్కించుకున్నాడు. అంగడి ద్వారా గతేడాది వచ్చిన ఆదాయానికి ఈ ఏడాది వచ్చిన ఆదాయాన్ని పోల్చుకుంటే దాదాపు రూ.2.80 లక్షల మున్సిపల్ ఆదాయం తగ్గింది. మున్సిపల్ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ఆదేశాల మేరకు వేలం పాటను తగ్గించినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. మూడుసార్లు అంగడి వేలం వాయిదా పడగా అధికారులే దిగివచ్చి వేలం పాటను తగ్గించారు. గుత్తేదారులు సిండికేట్‌గా ఏర్పడి సర్కార్ పాటను నామమాత్రంగా పెంచి అంగడిని దక్కించుకొని తమ పంతాన్ని నెగ్గించుకున్నారు.

వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం

సంగారెడ్డి క్రైమ్ : యువతి అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. పట్టణంలోని రాజంపేటకు చెందిన యువతి(21) ఈ నెల 27న మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఇంటి నుంచి వెళ్లి యువతి

యువకుడు అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ కథనం మేరకు.. పట్టణంలోని రాజ్యంపేటకు చెందిన కార్తీక్(22) 26న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం తండ్రి శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని, ఎవరికైనా తెలిస్తే 8712661830 నంబర్లకు తెలియజేయాలని పేర్కొన్నారు.

ఆస్పత్రికని వెళ్లి మహిళ

నర్సాపూర్ రూరల్: గిరిజన మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని జయరామ్ తండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డి గూడ పంచాయతీ పరిధిలోని జయరామ్ తండాకు చెందిన మెగావత్ భుజాలీ (52) 25న ఉదయం నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుంటానని ఇంట్లో చెప్పి వెళ్లింది. మధ్యాహ్నం కుమారుడు కుమార్ తల్లికి ఫోన్ చేయగా స్విచ్ఛాప్ వచ్చింది. అప్పటి నుంచి తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం కుమార్ నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



మెగావత్ భుజాలీ

హైదరాబాద్‌కని వెళ్లి యువకుడు

నారాయణఖేడ్: యువకుడు అదృశ్యమైన ఘటన ఖేడ్ మండలం చాప్టా (కె) గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మంగలి సురేశ్ పది రోజుల కిందట హైదరాబాద్‌కి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. హైదరాబాద్‌పాటు బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. జాడ తెలిసిన వారు 95698 89400, 70576 83423 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కుటుంబీకులు కోరారు.



మంగలి సురేశ్